

# శాపం

చెదిరిన జుట్టు, చెరిగిన కాటుక, కందిన చెక్కిళ్ళు, కోపంతో అదురుతున్న పెదాలు, దుఃఖంతో పూడుకుపోయిన కంఠం - ఇందిర తనను తాను సంబాళించుకుని శ్రుతితో అసలు విషయం చెప్పడానికి ప్రయత్నిస్తూంది. ఆమె వెనుక ఉరిశిక్షకు సిద్ధమవుతున్న ముద్దాయిలా

తలవంచుకుని నిలబడింది రంగ.

"ఏమిటి దంపతులిద్దరూ చెరోసారి వచ్చారు? ఇంతకుముందే మీ వారు 'అర్చన'ను తీసుకొచ్చి చూపించి వెళ్ళారు. ఏమిటలా చిక్కిపోయింది అర్చన?... నువ్వేమిటలా వున్నావు? నైట్‌డ్యూటీ చేశావా?" ఇందిర వంక పరిశీలనగా చూస్తూ ప్రశ్నలు కురిపించింది శ్రుతి. ఇందిర టెలిఫోన్ ఆపరేటర్‌గా చేస్తుంది. ఆమె పిల్లలిద్దరూ శ్రుతి నర్సింగ్‌హోమ్ లోనే పుట్టారు. ఆమె శ్రుతిని డాక్టరుగా కాక, స్నేహితురాలిగా, శ్రేయోభిలాషిగా భావిస్తుంది. తనకే సమస్య వచ్చినా శ్రుతి సలహా తీసుకుని దాన్ని పరిష్కరించుకోవడానికి ప్రయత్నిస్తుంది.

"నువ్వంతగా దిగులు పడాల్సిందేమీ లేదు. ఇందాక మీవారు అర్చన బ్లడ్ కొంచెం టెస్ట్‌కు తీసుకుంటే తెగ బాధపడిపోయారు. కూతురంటే ఆయనకెంత ప్రాణమో ఈరోజు చూశాను" ఇందిరను ఓదార్చడానికి ప్రయత్నించింది శ్రుతి.

"అది కాదు మేడమ్!" రంగ రెక్కపుచ్చుకుని ముందుకు లాగింది ఇందిర.

"ఇది తెలుసుగా మీకు?!" అప్పుడు గమనించింది శ్రుతి రంగను. ఇందిర మొదటి కాన్పుకు వచ్చినప్పుడు ఆరేళ్ళ పిల్ల రంగ. ఇందిర దూరపు బంధువుల పిల్ల. కళ్ళు విప్పిన కొద్దినెలలకే తల్లిదండ్రుల్ని కోల్పోయిన దురదృష్టవంతురాలు. అమ్మమ్మ రెక్కల కింద ఒదిగి ఆరేళ్ళు వచ్చేవరకు పల్లెటూళ్ళో వున్న రంగ, ఇందిర తల్లి వెంట ఇందిర బిడ్డనెత్తుకోవడానికి వచ్చింది. కడుపునిండా తిండయినా తింటుందని కొండంత సంబరంతో మనుమరాల్ని పంపడానికి ఒప్పుకుంది రంగ అమ్మమ్మ. . . ఇందిర తల్లి రంగగురించి చెప్పింది. అప్పటి నుంచి ఇందిర వెంట ఈ అమ్మాయి తరచు వస్తూనే వుంది. ఈ పిల్ల తెలియకపోవడం మేం తనకు?

"నీ యింట్లో యిన్నాళ్ళనుంచి వుంటున్నా, ఈ పిల్లకు బిత్తర చూపులూ, అమాయకత్వం పోలేదేమిటిందిరా?"

"అదే, ఆ అమాయకత్వమే యిప్పుడు కొంప ముంచింది" ఉలిక్కిపడి రంగ శరీరంలో వికసిస్తున్న యౌవనాన్ని గమనించింది శ్రుతి.

"ఇప్పుడు అమ్మ ముఖమెలా చూడాలో తెలియడం లేదు. వీళ్ళ అమ్మమ్మకేం సమాధానం చెప్పుకోవాలి?... మేడమ్! ఒకసారి దీన్ని పరీక్ష చెయ్యండి ముందు. ఏమడిగినా, తిట్టినా, కొట్టినా, కోసినా సరిగ్గా సమాధానం చెప్పడం లేదు... ఇది నా పిల్లల్తోపాటు పెరిగింది. వాళ్ళతోపాటు తిండిపెట్టాను. వాళ్ళకు కొన్నప్పుడల్లా బట్టలు కొన్నాను. నా మనిషిలా పెరిగింది. మెచ్యూర్ అయి సంవత్సరమయింది. అసలు అమ్మ అప్పుడే వాళ్ళమ్మమ్మ దగ్గరకు పంపేయమంది.

ఇన్నాళ్ళూ దానితో చేయించుకున్నదంతా మరచిపోయి దిక్కూమొక్కూ లేనిదాన్నిగా పంపేసి చేతులు దులుపుకోటానికి మనసొప్పింది కాదు. రెండు మూడేళ్ళు పోయాక పెళ్ళిచేసి పంపిద్దామనుకున్నాను. యింత ఘోరం యిలా జరిగిపోతుందని కలలో కూడా అనుకోలేదు.'' కడుపులో ఇముడ్చుకోలేని బాధతో ఆపకుండా చెప్పుకు పోతూంది ఇందిర. ఇందిర చెప్పేది వింటూనే ఎగ్జామినేషన్ రూమ్‌లోకి తీసుకెళ్ళి రంగని పరీక్ష చేసింది శ్రుతి. గర్భం ఐదవమాసం నిండుతూంది. శ్రుతి హృదయం కలచి వేసినట్లయింది. అనునిత్యం ఇలాంటి అవివాహిత గర్భవతుల్నెంతో మందిని చూస్తున్నా, ఇంత ముక్కుపచ్చలారని పిల్లల్ని ఈ పరిస్థితిలో చూస్తే కడుపు దేవేసినట్లుగా వుంటుంది. అమాయకత్వం, మూర్ఖత్వం, అతి తెలివి, పరిస్థితులు, థ్రిల్ కోసం, ఎడ్వెంచర్ కోసం ఎంతకైనా తెగించే మనస్తత్వం ఆడపిల్ల నీస్థితిలో నిలబెడు తున్నాయని తెలుస్తూనే వుంది. కాని ఇలాంటి పసితనం పోని అమ్మాయిల్నీ దారుణమైన స్థితికి లాక్కొచ్చే పరమ కిరాతకులు... ఏ న్యాయస్థానంలో వీర్ని దోషులుగా నిలబెట్టి నిరూపించగలుగుతారు? ఏ న్యాయమూర్తి వీళ్ళకు సరైన శిక్ష విధిస్తాడు?

"మీరే ఎలాగో ఈ ఆపదనుంచి గట్టెక్కించాలి'' ప్రాధేయపూర్వకంగా చూసింది ఇందిర.

"ఇన్నాళ్ళూ ఎలా గుర్తించలేదు ఇందిరా? ఇప్పుడేం చేయాలన్నా చాలా రిస్క్'' విచారంగా అంది శ్రుతి.

"ఇదంతా నా ఖర్మ. ఈ ఉద్యోగంవల్ల ఎప్పుడూ ఉరుకులు, పరుగులు. దీనికి కాపలా కాస్తూ కూర్చునే సావకాశమే వుంటే ఇంకెందుకు?... ఆ వెధవెవరో చెప్పేడవ్వే అని చచ్చేట్టు బాదాను. కొట్టీ, కొట్టీ నా చేతులు నొప్పిపుట్టాయి గాని అది నోరు విప్పలేదు... దొంగ రాస్కెల్! ఇంత ఘాతుకానికి ఒడిగట్టిన వాడెవడో? వాడి చెల్లెలికో, కూతురికో యిలా జరగాలి. నా శాపానికే ఆశక్తి ఉంటే వాడికాశాస్తి జరుగుతుంది. అప్పటికిగాని నా కసి తీరదు'' ఆవేశంగా అంటున్న ఇందిర గుండెల్లో బడబాగ్ని ప్రజ్వరిల్లుతూంది.

"తప్పు, అలా అనకు. తప్పు చేసింది ఒక దుష్టుడు అయితే, శిక్ష మరో అమాయకురాలి కెందుకు?''

ప్రమాదంతో కూడినదైనప్పటికి తప్పదని ఇందిర చెప్పాక, విధిలేక నర్సుని పిలిచి ఎబార్షన్ చెయ్యడానికన్నీ రెడీ చెయ్యమని చెప్పింది శ్రుతి.

"పిన్నీ!'' అప్పటివరకూ శిలావిగ్రహంలా నుంచున్న రంగ, ఆపరేషన్ థియేటర్‌లోకి రమ్మనగానే విహ్వలంగా చూస్తూ ఇందిరను కౌగిలించుకుని వెక్కివెక్కి ఏడ్చింది. మృత్యుభయంతో గజగజ వణికిపోతూందా పిల్ల. నచ్చచెప్పి, కసిరి, బుజ్జగించి లోపలకు

తీసుకువెళ్ళింది శ్రుతి. రంగని బల్లమీద పడుకోబెట్టి, వాష్ చేసుకుని, గ్లవ్స్ వేసుకుంటున్న శ్రుతికో ఆలోచనొచ్చింది. భయంతో వధ్యశిల నెక్కబోతున్న మేకపిల్లలావున్న ఆ అమ్మాయినిప్పుడు ఒత్తిడిచేసి అడిగితే తను గర్భవతి అవడానికి కారకులెవరో చెప్పదా? చెప్తే, ఎలాగయినా సరే ఆ అమ్మాయికి జరిగిన అన్యాయాన్ని సరిచేయడానికి ప్రయత్నించ వచ్చు.

"రంగా! ఇప్పుడయినా చెప్పు. ఎవరతను?" అనునయంగా అడిగింది శృతి.

"డాక్టరమ్మగారూ! నన్నేం చెయ్యొద్దు. నాకు ఆపరేషన్ వద్దు" ఏడుస్తూ బ్రతిమాలింది రంగ. హృదయ విదారకంగా వున్న ఆమె ఏడుపు చూస్తే జాలి వేసింది శ్రుతికి. ఈ అర్భకపు పిల్లేనా ఇందిర కొట్టిన దెబ్బలకు ఒళ్ళప్పగించింది అనిపించింది.

"చెప్పుమరి" ఇన్‌స్ట్రుమెంట్స్ తీసుకుంటూ అడిగింది శృతి.

"చెప్తాను. మా బాబాయే... మాపిన్నినైట్ డ్యూటీకి వెళ్ళినప్పుడు..." వెక్కుతూ చెప్తూంది రంగ. రాయిలా నిలబడిపోయింది శ్రుతి. ఇందిర అన్యోన్య దాంపత్యం, ఇందిరంటేనూ, పిల్లలంటేనూ ప్రాణంపెట్టే ఆమె భర్తా కళ్ళముందు నిలిచారు... ఈ పిల్ల చెప్తూంది నిజమేనా? ఇంత దారుణం, ఇంత అన్యాయం ఇందిర భర్త చేశాడా?... ఎలా ఈ అన్యాయాన్ని సరిచేయాలో తోచక, యాంత్రికంగా పిండం బయటపడడానికి చెయ్యవలసింది చేసింది శృతి.

రంగని తీసుకొచ్చి రూమ్‌లో పడుకోబెట్టారు. మతి చలించినదాన్లా అందరివంకా చూస్తూంది రంగ. ఆమె మెదడులోని ఏ సున్నితమైన నరాలు దెబ్బతిన్నాయో, ఆమె హృదయంలోని ఏ మృదువైన పొరలు చిరిగిపోయాయో - ఒక్కసారి అకస్మాత్తుగా, బిగ్గరగా అరవసాగింది. "మా బాబాయే నన్నిలా చేశాడు. మా బాబాయే నా కడుపుకు కారణం."

వెర్రిదాన్లా చూస్తూ గబుక్కుని శ్రుతి చెయ్యిపట్టుకుంది ఇందిర. 'వాడి చెల్లెలికో, కూతురికో యిలా జరగాలి. నా శాపానికే ఆ శక్తి వుంటే వాడికా శాస్తి జరుగుతుంది' ఇందిర శాపం వెయ్యి కంఠాలతో మార్మోగుతున్నట్లుగా అనిపించింది.